# చర్చ

చీకటి పడుతున్న వేళ. వర్షం పడుతూవుంది.

" ఏం వేగాన్ని తగ్గించావు" టీచర్ అడిగాడు డ్రైవర్ని"

" వైపర్స్ పనిచేయడం లేదుసార్" క్లీనర్ చెప్పాడు.

" రిపేర్ చెయ్యొచ్చుగ" ఓ విద్యార్థి సూచించాడు.

"యిప్పుడు కుదరదు, కాస్త ఆపు గురూ! దాన్ని రుద్దుతాను" అన్నాడు క్లీనర్

వ్యాన్ ఆగింది, క్లీనర్ దిగి వ్యాన్ ముందుకు నడిచాడు.

దేన్ని రుద్దుతాడో అని అందరు ఆసక్తిగ చూస్తున్నారు.

క్లీనర్ జేబులోనుండి ఓ సిగరెట్ తీసి తుంచి డ్రైవర్ ముందు అద్దానికి రుద్ది తిరుగొచ్చి తనసీట్లో కూర్చొని " రైట్" అన్నాడు.

వ్యాన్ కదిలింది, పొగాకు రుద్దినంత మేరకు నీటి చుక్కలు నిలవకుండ రాలిపోతున్నవి. రోడ్డు క్లియర్గ కనిపిస్తుంది. వ్యాన్ వేగం కాస్త పెరిగింది. విద్యార్థులతో పాటు, టీచర్ ఓ కొత్త విషయాన్ని తెలుకున్నట్టు చూస్తూ " ఒక వేళ సిగరేటు ఉండదనుకో అప్పుడు?" అడిగాడు టీచర్.

" పొగాకు లేకుంటే, యింత బట్టల సబ్బును రుద్దాలి" అన్నాడు డ్రైవర్.

" మంచి ఐడియా" టీచర్ మెచ్చుకున్నాడు.

కొన్ని కిలో మీటర్లు వచ్చినాక వర్షం లేనేలేదు.

రోడ్డు పక్కమ్మటే వ్యవసాయబావి, పశువుల కొట్టం, కొట్టానికి కొంత దూరంలో తగలబడుతున్న గడ్డివాము కాలుతు మంటలు పైకిలేస్తూ చివర్న నల్లని పొగ, పొగతోపాటు లేచి చుట్టూర పరుచుకుంటున్న కాలిన గడ్డిపోచల బూడిద ముక్కలు. అక్కడ ఎవరు వున్నట్టు కదిలికలు లేవు.

" వ్యాన్ ఆపు" టీచర్.

వ్యాన్ ఆగింది, అందరు దిగారు " పశువులమేత తగలబడి పోతుందే

ఎవరు లేనట్టుంది పదండి" టీచర్ అన్నాడు. ఉవ్వెత్తున లేస్తున్న మంటలకు పశువులు అరుస్తున్నాయి. బావికి అమర్చిన పంపునీళ్ళు పడే చోట కాలువచెడి ఓ మడుగులాగ తయారైంది. పక్కనే వున్న మట్టి గోలెం, రెండు నీళ్ల కుండలు వున్నాయి. విధ్యార్థుల్లో కొందరు నిప్పును ఎలా ఆర్పాలి అని ఆలోచిస్తూ, తోచిన మేరకు తమ ప్రయత్నాలను మొదలు పెట్టారు.

టీచర్ ఏదేదో చెపుతు వున్నాడు. యిద్దరు నీళ్లకుండలు తీసుకొని మడుగులో ముంచుకొచ్చి చల్లుతున్నారు. మరికొందరు అక్కడవున్న కర్రలు అందుకని కాలుతున్న గడ్డిని జారకొడుతున్నారు. ఈలోపు పక్క బావుల దగ్గర వున్న వాళ్లు పరుగెత్తుకొచ్చారు, మోటార్ స్టార్టర్‌వున్న రేకు డబ్బా తాళాన్ని పగులగొట్టి పంపును స్టార్ట్ చేశారు.

నీళ్లే నీళ్లు --

మంటలారిపోయాయి. నిప్పు చల్లారింది.

" ఎవరు పెట్టారు ఈ నిప్పు" టీచర్ ప్రశ్నించాడు.

" తెలవదు" అని అక్కడికొచ్చినవాళ్లు జవాబు చెప్పారు.

" మొత్తం మీద ఎవరో గిట్టనివాళ్లు చేసిన పనే యిది"ప్రక్కబావి పెద్దమనిషి అనుమానం వ్యక్తం చేశాడు. మనిషి గిట్టకపోతే పశువుల మేతను తగులబెగితే ఏమొస్తుంది టీచర్.

"అంత ఎవరాలోచిస్తారు తండ్రీ, యిష్టంలేని మనిషి కనక నష్టం చెయ్యాలంతే."

"ఈర్ష్య, ఓర్వలేనితనంతో తాను బాగుపడడు, పక్కవాన్ని బాగుపడనీయడు".

"ఆ నిప్పు పెట్టిందెవరో తెలిస్తే, బాగుండేది సార్" మూర్తి అన్నాడు.

" తెలుసు బాబు తెలుసు తెలిస్తే ఏం చేస్తాం?" పెద్దమనిషి నిట్టూర్చాడు.

" మీరు ఊర్కున్నారు మేమైతేనా? ఓ విద్యార్థి ఆవేశంగా అన్నాడు.

"వాన్నిపట్టుకొని" మరోవిద్యార్థి పళ్లుకొరికాడు.

" ఏమొస్తది బాబూ! తగులబడ్డ గడ్డి తిరిగి రాదు గదా" ఓ ముసలాయన అన్నాడు.

" అంటే తప్పు చేసినవాణ్ణి వదిలేయాలా?" ప్రశ్నించాడు ఒక విద్యార్థి.

ఎట్ల చెపితే అర్థమౌతది, ఏం చెపితే ఏం లాభం అన్నట్టు చూశాడు అందరి వైపు ఆ పెద్దమనిషి.

" మా పట్టణాలలో అయితేనా?" అన్నాడు మూర్తి. పెద్ద మనిషి ఓ మాదిరిగా నవ్వాడు. ఓ ఋషి నవ్వినట్టు కనిపించింది ఆ నవ్వు.

" చూడండి బాబులు పట్టణాల్లో గూడా బంగ్లాలు కూలి పోతునే వున్నాయి. పట్టపగలే ఆస్తులు కాలిపోతునే వున్నాయి."

" అది కాదు" మూర్తి కలుగజేసుకుని అన్నాడు.

" ఏది కాదు నేను చెపుతా పదండి" టీచర్ అన్నాడు.

" అసలు నరుడే రాక్షసుడు అయిపోతుండు."

టీచర్ ఆలోచనతో కూడిన చిరునవ్వు నవ్వి అక్కడినుండి కదిలి వ్యాన్ వైపు నడిచాడు. అందరు ఆయన్ని అనుసరించారు.

అందరు ఎక్కి కూర్చున్నాక వ్యాన్ కదిలింది.

ఈ మనుషులు, ఈ సంఘం, ఈ సమాజం గూర్చి వీళ్లలో రావలసిన మంచి మార్పు,ఓర్పు గూర్చి రేపటి పౌరులుగ, నవసమాజ స్థాపన గూర్చి తోవ పొడుగూత రకరకాల కొత్త ఆలోచనలు, చర్చలు సాగుతునే వున్నాయి. వ్యాన్ నడుస్తూనే వుంది.